ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు


5

శనివారం 7 జూన్ 2025

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ-2024కు గానూ టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడేళ్లలో 2022, 2023, 2024లో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారిని పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. వివరాలకు 9949298810, 9849497045లను సంప్రదించాలని కోరారు.

ఫీజుల మోత..!



- టెక్నోల పేరుతో.. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో విద్యావ్యాపారం
- తల్లిదండ్రుల జేబులకు చిల్లు
- పట్టించుకోని విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. పరిమితి సీట్లు అంటూ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీనితో తల్లిదండ్రులు తమ పిల్లలకు ముందుగానే అడ్మిషన్లు పొందుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకొంటున్నా అక్కడ వాస్తవానికి మౌలిక సదుపాయాలు దారుణంగా ఉంటున్నాయి. చాలా పాఠశాలలను ఇరుకు భవనాల్లో నడుపుతున్నారు. క్రీడామైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు మరుగుదొడ్లు ఉండడం లేదు.

తల్లిదండ్రుల బలహీనతే వారికి వరం

తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా పిల్లలను మంచి స్కూల్లో చేర్పించాలని తాపత్రయపడుతున్నారు. ఈ బలహీనతే కార్పొరేట్ స్కూళ్లకు వరంగా మారింది. కొంతమంది తల్లిదండ్రులు ఏ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉంటాయో, మార్కెట్‌లో దేనికి ఎక్కువ పేరుందో విచారించి.. అలాంటి పాఠశాలలోనే పిల్లలను చేర్పించేందుకు తపన పడుతున్నారు. దీనితో స్కూల్లో అడుగుపెడితే అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు.

అమలుకాని ఫీజుల నియంత్రణ చట్టం

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గత ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. అలాగే.. ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు.. ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలల్లో ఉన్న ప్రత్యేకతలు ఏమిటి తదితర సౌకర్యాల వివరాలను తల్లిదండ్రులకు కనిపించేలా బోర్డులో ప్రదర్శించాలి.. పాఠశాలల్లో వసూలుచేసే ఫీజులకు రసీదులు ఇవ్వాలి.. ఇలా పలురకాల నిబంధనలు కూడా విధించారు. అయితే దీనిపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్లు కోర్టులను ఆశ్రయించాయి. దీంతో ఫీజుల నియంత్రణ చట్టం వైసీపీ ప్రభుత్వంలో అమలు కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఊరట లభిస్తుంది.

> జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కాన్సెప్ట్, ఐఐటీ, టెక్నో, ఈటెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలంపియాడ్, సీబీఎస్సీ.. ఇలా ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని ఫీజులు దండుకుంటున్నారు. ఇది చాలదన్నట్లు బహిరంగ మార్కెట్‌లో రూ.2వేల నుంచి రూ.3వేలకు లభించే యూనిఫాం, పుస్తకాలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.8వేల నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులను నియంత్రించడంలో మాత్రం విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు.

ఇదీ ఫీజుల చిట్టా

అడ్మిషన్ ఫీజుతో పాటు.. ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లైబ్రరీ, లేబొరేటరీ, ఫర్నిచర్, కాషన్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా ఫీజుల చిట్టా విప్పుతూ ఊపిరి పీల్చుకోనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతో పాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. అతికష్టం మీద ఈ ఫీజులు చెల్లించిన తర్వాత పుస్తకాలు, యూనిఫాం, షూలు, అట్లలు.. ఇలా వాటి జాబితా కూడా చాంతాడంత ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఫస్ట్ టర్మ్ ఫీజు 60శాతం చెల్లించి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడే లోపే రెండవ టర్మ్ చెల్లించాలని లేదంటే పరీక్షలు రాయించమని పిల్లల డైరీలో రాసి పంపిస్తుంటారు. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు సైతం ఫీజుల విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాయి.

నేడే బక్రీద్ పండుగ

- సామూహిక ప్రార్థనల కోసం ముస్తాబైన ఈద్గాహ్‌లు



పీలేరు ఈద్గాహ్ మైదానాన్ని చదును చేస్తున్న సర్పంచ్ హబీబ్, పంచాయతీ కార్మికులు

పీలేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగనిరతిని బోధించే పండుగ బక్రీద్ రానే వచ్చింది. జిల్లా వ్యాప్తంగా సామూహిక ప్రార్థనల కోసం మసీదు కమిటీ సభ్యులు ఈద్గాహ్‌లను సిద్ధం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఎండ వేడి ఎక్కువగా ఉండడంతో షామియానాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖురాన్, హదీసుల ప్రకారం దైవ ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగాన్ని స్మరించుకోవడంతో పాటు తమకు పవిత్ర హజ్ యాత్ర ప్రసాదించినందుకు కృతజ్ఞతగా ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకుంటారు. 80 ఏళ్ల ముదసలి ప్రాయంలో లేకలేక కలిగిన ఏకైక సంతానమైన హజరత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంను దైవాజ్ఞ మేరకు బలి ఇవ్వడానికి సిద్ధపడతారు.. హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం. తన ఆజ్ఞ మేరకు ప్రాణానికి ప్రాణమైన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధపడిన హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగనిరతికి మెచ్చిన అల్లాహ్ చివరి క్షణంలో స్వర్గం నుంచి తెప్పించిన ఓ పొట్టేలును హజరత్ ఇస్మాయిల్ స్థానంలో పెట్టి ఆయనను కాపాడతారు. అప్పటి నుంచి ఖుర్బానీ ఇవ్వడం ఇస్లాంలో భాగమైంది. అలా ఇబ్రహీం, ఇస్మాయిల్ అలైహిస్సలాంలను త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ బక్రీద్ రోజున ముస్లింలు ఖుర్బానీ ఇస్తుంటారు. అయితే కేవలం జంతువులను ఖుర్బానీ ఇవ్వడమే కాకుండా అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రాపంచిక విషయాలను కూడా త్యజించడానికి సిద్ధంగా ఉండాలని ఖుర్బానీ ఉపదేశిస్తుంది. ఆ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శనివారం బక్రీద్ పండుగ జరుపుకోనున్నారు. ఆ క్రమంలో పీలేరు పట్టణం మదనపల్లె టర్నింగ్‌లోని ఈద్గాహ్ మైదానాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ డా.హబీబ్ బాషా, ఈద్గాహ్ కమిటీ సభ్యులు పారిశుధ్య కార్మికుల సాయంతో శుభ్రపరిచారు. సామూహిక నమాజు శనివారం ఉదయం 8 గంటలకల్లా మొదలవుతుందని పీలేరు జామియా మసీదు ముతవల్లీ అల్లావుద్దీన్ తెలిపారు.

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి: కలెక్టర్



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకుని మత సామరస్యంతో వ్యవహరిస్తూ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ నెల 7న బక్రీద్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో కలెక్టర్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన జిల్లాలో ఇటీవల మదనపల్లిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర శాంతియుతంగా జరిగింది. అదే స్ఫూర్తితో శనివారం బక్రీద్ పండుగ కూడా ఎలాంటి ఆటంకం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను పటిష్ఠంగా చేశామన్నారు. ఇందులో భాగంగా 24/7 ప్రకారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లా నోడల్ అధికారిని కూడా నియమించినట్లు చెప్పారు. చట్టాన్ని ఎవ్వరూ చేతుల్లోకి తీసుకోరాదని, ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డీఆర్వో మధుసూదన్‌రావు, అడిషనల్ ఎస్పీలు వెంకటాద్రి, మనోజ్, రామనాథ్ హెగ్డే, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి హిదయతుల్లా, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రూ.2073 కోట్లతో అభివృద్ధి పనులు

- కేంద్ర నోడల్ ఆఫీసర్ శిష్యపాల్ సెథి



బండమీదపల్లి గ్రామ సచివాలయం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం నోడల్ ఆఫీసర్ శిష్యపాల్ సెథి

పెద్దమండ్యం/బి.కొత్తకోట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా రూ.2073 కోట్ల నిధులతో గండికోట జలాలు వాటర్‌గ్రిడ్ పైపులైన్ అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నట్లు కేంద్ర జలజీవన్ మిషన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ శిష్యపాల్‌సెథి పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. మండలంలోని బండమీదపల్లి గ్రామ సచివాలయంలో ఆ గ్రామ ప్రజలు, విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ, ప్రజాప్రతినిధులు, అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గండికోట జలాలు తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు నియోజకవర్గాల్లోని 26 మండలాలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. అలాగే ప్రధాన నీటి నిల్వల కోసం గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తారని తెలిపారు. ఈ సౌకర్యాలపై పలు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గండికోట నుంచి నీటి సరఫరా పైపులైన్లు, కాలువ పనులు, పలు ప్రాంతాల్లో వాటర్‌గ్రిడ్ పనులకు స్థల ఎంపిక పరిశీలన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. బండమీదపల్లి సర్పంచ్ బయ్యారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఆర్‌ఈవో ప్రసన్నకుమార్, ఈఈ రషీద్‌ఖాన్, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో జీజేఎం సెంట్రల్ కమిటీ కన్వీనర్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో శుక్రవారం కేంద్ర జలజీవన్ మిషన్ కన్వీనర్ ఎస్పీ సేథి విడిది చేశారు. హర్యానాకు చెందిన ఈయన రిటైర్డ్ ఉన్నతాధికారి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టనున్న వాటర్‌గ్రిడ్ పథకం పరిధిలోని పనుల పరిశీలన నిమిత్తం శుక్రవారం కడప జిల్లా పర్యటన, అనంతరం అన్నమయ్య జిల్లా పర్యటనకు వచ్చారు. పెద్దమండ్యం మండల పర్యటన అనంతరం హార్సిలీహిల్స్‌కు చేరుకొని గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. కడపజిల్లా గండికోట నుంచి అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ వరకు పైపులైన్ ద్వారా నీటిని తరలించి, అక్కడి నుంచి రూ.2370 వేల కోట్లతో తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు తాగునీటిని అందించే బృహత్తర పథకంపై ఆయన సమీక్షించారు. ఆర్‌డబ్ల్యుయస్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.

మొదటి రోజు ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు



రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల వద్ద హాల్‌టికెటు నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

రాయచోటి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ (ఉపాధ్యాయ నియామక పరీక్ష) శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 6 పరీక్షా కేంద్రాల్లో జరగ్గా, 1363 మంది అభ్యర్థులకు గానూ 1137 మంది హాజరయ్యారు. 226 మంది ఆబ్సెంట్ అయ్యారు. అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (రాజంపేట), విశ్వం ఇంజనీరింగ్ కళాశాల (అంగళ్లు), మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (మదనపల్లె), ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (మదనపల్లె), శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (రాయచోటి), భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (రాయచోటి)లో జరిగిన పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

రాజంపేటలో భారీ అగ్ని ప్రమాదం



కొయ్యల డిపోలో అర్ధరాత్రి వేళ మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

రాజంపేటటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విలువైన కొయ్యలు అగ్నికి ఆహుతై పెద్ద మొత్తంలో నష్టం జరిగింది. వివరాలిలా.. పట్టణంలోని సబ్‌స్టేషన్ సమీపంలో నందలూరు మండలం ఎర్రిపాపాయపల్లె గ్రామానికి చెందిన హరిక్రిష్ణ కొయ్య కోత మిషన్‌లో గురువారం అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని గంటలు తరబడి యత్నించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రమాదంలో విలువైన టేకు సంబంధించిన కలప పూర్తిగా దగ్ధమైందని బాధితుడు హరిక్రిష్ణ కన్నీంటి పర్యంతమయ్యారు. కాగా ఈ విషయమై అర్బన్ పోలీసుస్టేషన్ సీఐ రాజాను వివరణ కోరగా.. ఈ ఘటనపై బాధితులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు, కాంగ్రెస్ నేత పూలభాస్కర్, పలువురు ప్రముఖులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా.. డబ్బులు వేయండి

- ముగ్గురు తహశీల్దార్లకు ఫోన్

ములకలచెరువు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): "ఎవడయ్యా బాబు తంబళ్లపల్లె ఎమ్మార్వోనా.. నేను సీఎం గారి ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా.. ప్రిన్సిపల్ సెక్రటరినీ.. ఏం పేరు బాబు.. హరికుమార్ మీరేనా.. కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్సులో ఉన్నాం.. కొంత జాగ్రత్తగా మాట్లాడు నాయనా.. పూర్తి పేరు చెప్పు.. నోట్ చేసుకుంటున్నా.. టెన్షన్ పడాల్సిన అవసరం లేదు.. మీడియా సీనియర్ ఎడిటర్లు, సబ్ ఎడిటర్లు నా ముందే ఉన్నారు.. వాళ్లది యానవర్సిరీ ప్రోగ్రాం ఉందంటా.. వాళ్లందరూ నా ముందే ఉన్నారు.. నోట్ చేసుకుంటున్నారు.. 600 మందికి భోజనాలు పెడుతారంటా.. ఏడాదికి ఒక సారి కార్యక్రమం నిర్వహిస్తారంటా.. ఇప్పుడు కార్యక్రమాన్ని చేస్తున్నారు.. ఫోన్ పే నెంబర్ చెబుతారు.. డబ్బులు వెయ్.. ఎంత వేస్తావు చెప్పు.. నాకు సమయం లేదు.. జేసీలు అందరూ వెయిట్ చేస్తున్నారు.. వెయిటింగ్ కాల్స్ వస్తున్నాయి.. ట్రాన్స్‌ఫర్స్ ప్రమోషన్స్ చూడాలి.. రూ.35 వేలు వేయి.. గవర్నర్ గారూ వచ్చే సమయం అయ్యింది.. డబ్బులు వేస్తే మీడియా వాళ్లు వెళ్లిపోతారు.. త్వరగా డబ్బులు వెయ్" అంటూ తంబళ్లపల్లె తహశీల్దార్ హరికుమార్‌కు శుక్రవారం ఫోన్ వచ్చింది.

అలాగే ములకలచెరువు, పెద్దమండ్యం తహశీల్దార్లు ప్రదీప్, సయ్యద్‌లకు కూడా ఇదే ఫోన్‌నెంబర్ నుంచి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. డబ్బులు వేయమని ఫోన్‌పే నెంబర్ చెప్పి మరీ బెదిరింపు ధోరణిలో దబాయించాడు. ములకలచెరువు తహశీల్దార్‌కు ఫోన్ చేసి 400 మందికి భోజనాలు పెట్టాలని డబ్బులు డిమాండ్ చేయగా పెద్దమండ్యం తహశీల్దార్‌కు ఫోన్ చేసి 200 మందికి భోజనాలు పెట్టాలని డబ్బులు అడిగాడు. సీఎం కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పగానే తహశీల్దార్లు నిజమేనని నమ్మారు. డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి ఫోన్ కట్ చేశారు. ముగ్గురు తహశీల్దార్లకు 09010703158 నెంబర్ నుంచి కాల్ చేశాడు. కాగా కాల్ చేసిన వ్యక్తి ఎవరో తెలియక తహశీల్దార్లు హైరానా పడ్డారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం

- ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి
- ఏటేటా పెరుగుతున్న పంట వ్యయం
- పెట్టుబడికి రైతన్నల అవస్థలు



పొలాలను శుభ్రం చేస్తున్న రైతులు



దుక్కులు చేసిన పొలం

కలకడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. గత వారం క్రితం కురిసిన వర్షాలకు పొలాలను శుభ్రం చేసి దుక్కులను చేస్తున్నారు. అనాదిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాలైన కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం, పెద్దమండ్యం, మొలకలచెరువు, పీటీఎం తదితర మండలాల రైతులు ఈ సీజన్‌లో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ దశాబ్దకాలంగా ఈ పంట సాగు రైతుకు ఆశించిన దిగుబడి లాభాలు రాకపోవడంతో ఇతర పంట సాగుపై దృష్టి సాధించారు. ఈ కోవలో ఉద్యానవన పంటలైన టమోటా సాగుకు ఎక్కువ శాతం మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు కొందరు బొప్పాయి, వంగ, ఇతర కూరగాయలను ఎంచుకుంటున్నారు. కలకడ మండలంలో 2022లో 2245 ఎకరాల్లో, 2023-24లో 1600 పైచిలుకు ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ప్రస్తుతం టమోటా సాగుకు ఎకరానికి రూ.2.5 లక్షలు పైగా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పంట సంరక్షణకు ఆధునిక పద్ధతులను అవలంబించడం వలన ఖర్చు మరింత పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాయశక్తులా చమటోడ్చుతున్నా ఏటేటా అప్పుల పాలవుతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నట్లు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, ధరల పతనంతో నష్టాలను మూటగట్టుకున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో లభ్యమయ్యే నకిలీ క్రిమి సంహారక మందులు, డ్రిప్ ఎరువులు, నర్సరీలలో దొరికే నాసిరకం నారుతో మోసపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. రబీలో కూడా ఇలాంటి గడ్డు స్థితి ఎదురవ్వడం మూలంగా కొత్త పంటల సాగు పెట్టుబడికి అవస్థలు మొదలైనట్లు వాపోతున్నారు. కిందట చేసిన అప్పులు పేరుకుపోగా మళ్లీ నగదు సమకూర్చుకోవడం కష్టతరంగా మారిందన్నారు. ఈ తరుణంలో బ్యాంకులు ముందుకొచ్చి విరివిగా పంట రుణాలు మంజూరు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. అలాగే పంట వ్యయ భారం కాకుండా అధికార యంత్రాంగం డ్రిప్ పరికరాలు, ఎరువులు, మందులు సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టాలను మూటగట్టుకున్నా



ఉద్యానవన పంటలు సాగు చేయాలంటే పెట్టుబడికి లక్షలు అవసరం. ఆనవాయితీగా గత ఖరీఫ్‌లో 3 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాను. ఇందుకు రూ.7 లక్షలు దాకా ఖర్చు అయింది. పంట చేతికి వచ్చిన సమయానికి ధరలు లేవు. సరుకు అమ్మగా వచ్చిన నగదు కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోయాయి.

- శ్రీరాములునాయుడు, రైతు, కలకడ

పంట వ్యయం పెరిగింది



టమోటా పంట సాగుకు వ్యయం భారీగా పెరిగింది. డ్రిప్‌ల దగ్గర నుంచి పంట చేతికి వచ్చేదాకా ఎకరానికి పెట్టుబడి రూ.2.5 లక్షలు అవుతుంది. రబీలో రెండున్నర ఎకరాల్లో టమోటా పంట సాగు చేయగా పెట్టుబడి కూడా రాలేదు. కొత్తగా పంట సాగు చేయాలంటే భయంగా ఉంది. ప్రభుత్వం సబ్సిడీతో మందులు, ఎరువులు, డ్రిప్ పరికరాలను అందించాలి.

- తిమ్మయ్య, రైతు, కలకడ

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



రాయచోటిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గో సంరక్షణ చట్టం-2017 అమలులో ఉందని, గోవులను వధించడం పూర్తిగా నిషేధమని, ఈ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, భక్తికి ప్రతీక బక్రీద్ పండుగ అని, ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని తీసుకురావాలని, ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అంతేగాక ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో వచ్చే సందేశాలపై, దృశ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, పండుగల సందర్భంగా వదంతులు, పుకార్లను నమ్మకూడదని వివరించాల్సిన బాధ్యత మత పెద్దలదేనన్నారు.

త్యాగానికి, సహనానికి ప్రతీకగా బక్రీద్

రాయచోటిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ పండుగ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తుల కల్పవల్లి.. నాగారపమ్మ

● నేటి నుండి తిరునాళ్లు ప్రారంభం ● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

సుండుపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగుబంగారం నాగారపమ్మ తల్లి. దశాబ్దాల చరిత్ర కలిగిన నాగారపమ్మ తిరునాళ్లను ఈ ఏడాది మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు జిల్లాకే తలమానికంగా నిలవబోతున్నాయి. మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లె గ్రామంలో బాహుదానది పరివాహ ప్రాంత సమీపంలో వెలిసిన నాగారపమ్మ తల్లి మహిమాన్వితం. ఈనెల 7వ తేదీ శనివారం ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, హోమాలతో ప్రారంభమై 8న ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, పుట్ట నుంచి పుట్టమన్ను బంగారం తెచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. 9న సోమవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, రాత్రికి గావు పట్టే కార్యక్రమంతో పాటు చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుంది. ఈ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

నాగారపమ్మ తల్లి చరిత్ర

ఎంతో చరిత్ర కలిగిన నాగారపమ్మ తల్లి శిల్పాన్ని రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి సమీపంలోని నాగారం నుంచి కొందరు దొంగలు అపహరించి తీసుకెళ్తుండగా పింఛానది ఒడ్డుకు రాగానే చీకటి పడటంతో అక్కడే ఆగారు. ఉదయం నది దాటుతుండగా అమ్మవారి విగ్రహం నదిలో పడిపోవడంతో ఎంత వెతికినా దొరకలేదు. దీంతో దొంగలు అక్కడి నుండి వెళ్లిపోయారు. పెద్దినేనికాలువ పంచాయతీలోని బండకాడ ఈడిగపల్లెకు చెందిన కొందరు రజకులు నదిలోకి వెళ్లినప్పుడు వారికి అమ్మవారి విగ్రహం దొరికిందని స్థానికులు చెబుతుంటారు. ఈ విగ్రహాన్ని తీసుకువచ్చి బండకాడ ఈడిగపల్లెకు దక్షిణ భాగాన ప్రతిష్ఠించి చిన్న గుడిగా నిర్మించుకున్నారు. అప్పటి నుండి ప్రతి గురు, ఆదివారాల్లో అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతుండటం ఆనవాయితీగా మారిపోయింది. ప్రతి యేటా ఏరువాక పౌర్ణమికి నాగారపమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే ప్రత్యేకంగా ఈ ఏడాది భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాతరకు అన్నమయ్య, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడం విశేషం.



నాగారపమ్మ తల్లి మూలవిరాట్

అనుమతులు తప్పనిసరి..



చాందినీ బండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలి. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లు నిర్వహించుకోవాలి. సుమారు వంద మందికిపైగా సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నాం.

- ముత్యాల శ్రీనివాసులు, ఎస్ఐ

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి..



చాందినీ బండ్లు కట్టేవారు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. దీనివల్ల ఆ గ్రామంలో లైన్‌మన్ అందుబాటులో ఉంటారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తారు. చాందినీబండ్లను ఎక్కువ ఎత్తు లేకుండా చూసుకోవాలి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- రమేశ్, విద్యుత్‌శాఖ ఏఈ

సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి



ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని జంగిటివారిపల్లెకు చెందిన అనంతయ్యగారి ప్రసాద్ రూ.50 వేలు, బంకపూరి వెంకటమ్మకు రూ.27వేలు, అనంతరాజుపేటకు చెందిన చల్లం నరసింహులుకు రూ.59,884, దేశు విశ్వనాథరెడ్డికి రూ.65 వేలు, ఉర్లగట్టుపోడు అరుంధతివాడకు చెందిన వెయ్యాల లోహితకు రూ.35వేలు, ఆవలకుంట సుబ్బలక్షుమ్మకు రూ.47,642, తిమ్మిశెట్టిపల్లెకు చెందిన కమలగిరి నాగమునెమ్మకు రూ.40వేలు, బయనపల్లెకు చెందిన కస్తూరి శంకరయ్యకు రూ.45,933, రెడ్డివారిపల్లె పంచాయతీ కేసీ అగ్రహారానికి చెందిన శేఖర్‌రెడ్డికి రూ.71,664ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, కొవ్వూరు నారాయణ, ఉత్తరాది శివకుమార్, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, మహేష్, శివశంకర్, రామసుబ్బయ్య, దేశు క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సుబ్బరాయుడు

సిద్దవటం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి మండల కేంద్రమైన సిద్దవటం, దిగువపేట, గాంధీవీధిలో దోమల పెరుగుదల అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, ఫైలేరియా వంటి జ్వరాలు సోకే ప్రమాదం ఉందని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహాల చుట్టూ నీరు నిల్వ ఉంటే లార్వా ఉత్పత్తి చెంది దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు గురుగుపల్లి హైస్కూల్ విద్యార్థి



పల్లపు విజయ్‌కుమార్

రాయచోటిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు రాయచోటి మండల పరిధిలోని పెమ్మాడపల్లి గ్రామం గురుగుపల్లి హైస్కూలు విద్యార్థి పల్లపు విజయ్‌కుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగప్రభ, స్కూలు కమిటీ ఛైర్మన్ ఆంజనేయులు తెలిపారు. 2024 నవంబర్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో విజయ్ కుమార్ 110మార్కులతో జిల్లాలో జనరల్ కేటగిరీలో 12వ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనందున సంవత్సరానికి రూ.12వేల చొప్పున విద్యార్థి చదువు కొనసాగించినంత కాలం అందజేయబడుతుందన్నారు. విజయ్‌కుమార్ ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

లక్కిరెడ్డిపల్లె, జూన్6(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తున్నట్లు ఎంఈవో చక్రే నాయక్ తెలిపారు. షేక్ ఆసిరా 600/583 విశ్వభారతి హైస్కూల్, అవలకుంట కిశోర్ బాలు 600/579 దేవంపల్లి జెడ్పీ హైస్కూల్, చిన్నకొండ తానేశ్ 600/575 జాండ్రపల్లె జెడ్పీ హైస్కూల్, ఉడుము షణ్ముఖ రాయల్ 600/572 ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరికి ఈనెల 9వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, రూ.20 వేల నగదు అందించనున్నట్లు తెలిపారు.

సంబేపల్లె మండలం నుంచి..

సంబేపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ పాఠశాల నుండి బసిరెడ్డి సాయి ప్రగతి, బండి నిఖిత, ఆదర్శ పాఠశాల నుండి షేక్ జాఫర్‌వలి, సంబేపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి సయ్యద్ రుక్సానా, గున్నికుంట జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి చింత మోనిష్క ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పత్రికా ప్రకటన

వై.యస్.ఆర్. జిల్లా నూతన కలెక్టరు వారి కార్యాలయం నందు లాప్‌టాప్స్ మరియు స్కానర్లు కొనుగోలు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది. లాప్‌టాప్స్ మరియు స్కానర్లు (Configuration) వివరాలు 09.06.2025వ తేది నుండి 20.06.2025వ తేది మధ్యాహ్నం 02.00 గంటల వరకు పరిపాలన అధికారి, కలెక్టరు వారి కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.7500/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తుకు స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 20.06.2025వ తేది మధ్యాహ్నం 05.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 20.06.2025వ తేదిన సాయంత్రం 06.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- శ్రీమతి అదితి సింగ్, ఐ.ఏ.ఎస్.
జాయింట్ కలెక్టర్ / ఛైర్మన్, డి.సి.సి. కడప.

మోడల్ కళాశాలలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె/పెనగలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ కళాశాలలో మిగిలిన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. అలాగే పెనగలూరు మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7వ తరగతిలో 3, ఎనిమిదో తరగతిలో ఒక సీటు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఏర్పడిన ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సీ తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, ఆ ఆన్‌లైన్ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు.

కార్యకర్తల మనోభావాలను గుర్తించండి

● రాజంపేట అభివృద్ధి కోసం ఇన్‌చార్జిని ప్రకటించాలని డిమాండు

రాజంపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల మనోభావాలను గుర్తించాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో నియోజకవర్గంలోని నేతలు, కార్యర్తలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజంపేట నియోజకవర్గంలో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేశారన్నారు. కానీ కొంతమంది వైసీపీ నేతలు కూటమి ముసుగులో చేరి అభ్యర్థి ఓటమికి బాధ్యులయ్యారని ఆరోపించారు. పార్లమెంట్ అధ్యక్షుడు అని చెప్పుకుంటున్న నేత తనకు అనుకూలంగా ఉన్న కొంతమందితోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ అధ్యక్షుడికి ఈ ఒక్క నియోజకవర్గమే కనపడిందా అని ప్రశ్నించారు. ఒక్క సామాజిక వర్గానికే కొమ్ము కాస్తూ గత ఎన్నికల్లో ఓటమికి పరోక్ష బాధ్యుడయ్యారని ఆరోపించారు. ఓటమిపాలైన అభ్యర్థి ఇన్‌చార్జిగా ఉంటారు, కానీ రాజంపేట నియోజకవర్గం ప్రత్యేకమా అని ప్రశ్నించారు. పార్టీ నేతలకు, కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తిని రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించి కార్యకర్తల సమస్యలు తీర్చాలన్నారు. ఈ విషయాన్ని నేరుగా మంగళగిరిలోని పార్టీ అధిష్టానాన్ని కలిసి విన్నవిస్తామన్నారు.

కార్యక్రమంలో భవగాన్ సహాయరెడ్డి, పుత్తా రామచంద్రయ్య, విజయ్ కుమార్, కిరణ్‌కుమార్, ఎం.హరి, నాగేంద్ర బాబు, జయరామయ్య, తిరుపాలు, గిరిజ, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన నాగేంద్ర ఫైల్‌ఫొటో

రాజంపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఎస్ఆర్ పాలెం సమీపంలో బుగ్గల నాగేంద్ర(38) ప్రమాదవశాత్తు ఆటో నుంచి పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడే మృతి చెందాడు. నాగేంద్ర భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి చిన్నమండెం వద్ద ఉన్న అత్తగారింట్లో వదిలి తిరుగు ప్రయాణమయ్యాడు. ఎస్ఆర్ పాలెం సమీపంలోకి రాగానే అతివేగంతో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ఒంటిమిట్ట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకాటపల్లె గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త భవనాసి శేషయ్య గుండెపోటుతో మృతిచెందారు. గురువారం సాయంత్రం శేషయ్యకు గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఈయన ప్రముఖ న్యాయవాది, టీడీపీ సీనియర్ నాయకుడు భవనాసి రామదాసుకు సోదరుడు.

సంబేపల్లె హైస్కూల్ అభివృద్ధికి కృషి

సంబేపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె హైస్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డైట్ లెక్చరర్‌గా బదిలీపై వెళ్లిన మడి తాటి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఆయన సంబేపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన సుంకర రామక్రిష్ణను అభినందించి సన్మానించారు. తాను సంబేపల్లె హైస్కూ ల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన సమయంలో విద్యార్థుల తల్లి దండ్రుల సహకారంతో పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి దపేదార్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ (ఉర్దూ) ప్రధా నోపాధ్యాయులు వంగిమళ్ల వేణుగోపాల్, హిందీ ఉపాధ్యాయులు పీయం బాషా, పాఠశాల జూనియర్ అసిస్టెంట్ తిక్కం శైలజ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీపీ



ఒంటిమిట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నల్లగొండ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సమస్యలు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తాము చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో గౌస్‌బాషా, తహసీల్దారు రమణమ్మ, ఎంఈవో వెంకటసుబ్బయ్య, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాన్య కార్యకర్తకు చైర్మన్ పదవి

- నేడు డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాష్ ప్రమాణ స్వీకారం



ఎర్రగుండ్ల జయప్రకాష్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడే వాళ్లకి పదవులు ఇస్తారన్నది నగ్నసత్యం. నేడు డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాష్ ప్రమాణీస్వీకారం చేయడమే ఇందుకు నిదర్శనం. సామాన్య కార్యకర్త నుంచి డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎదిగిన జయప్రకాష్ 20 సంవత్సరాల నుంచి టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూవచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తనదైన శైలిలో పార్టీలో దూసుకుపోయారు. స్థానికంగా అందరితోను సఖ్యతగా వ్యవహరిస్తారు. ఎలాంటి పదవులు ఆశించకుండా నిరంతరం పార్టీ కోసమే పని చేశారు. జయప్రకాష్ స్వగ్రామం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట. తల్లి ఎర్రగుండ్ల రామలక్షుమ్మ ఎంపీటీసీగా గతంలో టీడీపీ తరపున విజయం సాధించారు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేశారు. వీరికి రాజకీయ నేపథ్యం లేదు. అయినా ఆయన తల్లిని ఎంపీటీసీగా నిలబెట్టారు. అప్పటి నుంచి జయప్రకాష్ రాజకీయాలను అలవరుచుకున్నారు. గతంలో జయప్రకాష్ మార్కెట్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం రైల్వేకోడూరు టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. టీడీపీకి చేసిన సేవ, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి చొరవ, కృషితో జయప్రకాష్‌కు చైర్మన్ పదవి వరించింది.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- ఊటుకూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



సాయిలోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

రాజంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. శుక్రవారం రాజంపేట మండలం ఊటుకూరు గ్రామంలో అంకాళమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆ గ్రామ యువ నాయకులు, అభి రెస్టారెంట్ అధినేత తోట వెంకట్, ఊటుకూరు చెరువు సంఘ అధ్యక్షుడు నామా హరినాథ్, కుసులూరు హరిక్రిష్ణ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఊటుకూరు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గ్రామ శ్మశానవాటిక వ్యవహారం ఇబ్బందిగా ఉందని, అదేవిధంగా తాగునీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బాలిశెట్టి నారాయణ, మలిశెట్టి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

రైల్వేకోడూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు విద్యాశాఖాధికారి-2 సుందర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పాఠశాలలకు ముందు, వెనుక ఇంటర్నేషనల్, ఒలంపియాడ్, టెక్నో, ఈ టెక్నో, కాన్సెప్ట్, ఐఐటీ, సైనిక్, పబ్లిక్ వంటి పేర్లతో బహిరంగంగా ఫ్లెక్సీలు వేసుకొని ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేలాది రూపాయలను అక్రమంగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్నారన్నారు. యూనిఫాం, పుస్తకాలు ఆయా పాఠశాలల్లోనే ఇస్తున్నారని, అటువంటి కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్6(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో పీఎం పోషణ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక వంట ఏజెన్సీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులకు అందించాల్సిన నూతన మెనూపై వివరించారు. పాఠశాల వంట నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వంట ఏజెన్సీలకు వంట పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య, సీఆర్‌పీలు రాంమోహన్, శశికళ, చంద్రకళ, మల్లికార్జున, వంట ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

కంకర వేశారు..
తారు మరిచారు

- రెండేళ్లయినా జరగని పనులు
- వేసిన కంకర కూడా దెబ్బతిన్న వైనం
- రూ. కోటి పనులపై అధికారుల నిర్లక్ష్యం



రోడ్డు మధ్యలో గుంత పడడంతో నిలిచిన నీరు

రైల్వేకోడూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీ కండ్రిక పంచాయతీ నుంచి వినాయకనగర్ గిరిజాకాలనీ వరకు రూ.కోటితో 2023లో (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) కింద అప్పటి ప్రభుత్వం తారు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసింది. 2.5 కిలోమీటర్ల దూరం వరకు ఈ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా మొదటగా మట్టి పనులు చేశారు. తర్వాత కంకర వేశారు. ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. వేసిన కంకర కూడా వాహనాల రాకపోకలతో పక్కకు వెళ్లిపోయింది. అలాగే రోడ్డు అక్కడక్కడ దెబ్బతిన్నది. రెండు సంవత్సరాలు దాటినా రోడ్డుకు తారు వేయలేదు. అధికారులు ఈ రోడ్డు పరిశీలించకుండా నిర్లక్ష్యం చేయడం, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో రోడ్డు అధ్వానస్థితికి చేరుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మట్టి పనులు నాశిరకంగా చేశారని విమర్శిస్తున్నారు. వీవీ కండ్రిక నుంచి వినాయకనగర్ వరకు వ్యవసాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పంటలకు నీరు, ఎరువులు, కూలీలు, దున్నకాలు తదితర పనులు చేసుకోవాలంటే రైతులు ఈ రోడ్డు మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. వినాయకనగర్‌కు సమీపంలో సుద్దరాయి గనులు ఉన్నాయి. ఈ రోడ్డు మార్గం గుండా చిన్న, పెద్ద వాహనాల రాకపోకలుంటాయి. దీంతో వేసిన రోడ్డు దెబ్బతినిపోయింది. ఇక వర్షం వస్తే వేసిన కంకరతో పాటు మట్టి కూడా కొట్టుకునిపోతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ద్వారా వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేశారని పలువురు చెబుతున్నారు. ఇప్పకైనా అధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

రూ. 70లక్షలకు పనులు చేశారు

వీవీ కండ్రిక నుంచి వినాయకనగర్ ఎస్టీకాలనీ వరకు మంజూరైన రోడ్డు పనులకు కాంట్రాక్టర్ రూ.70లక్షల వరకు పనులు చేశారని ప్రాజెక్టు ఇంపిమెంటేషన్ యూనిట్ రాజంపేట ఏఈ మదన్ తెలిపారు. రోడ్డు నాశిరకంగా జరగలేదన్నారు. బిల్లులు రావాలని రోడ్డు పనులు పెండింగ్ పెట్టారన్నారు. జూన్ మొదటి వారం బిల్లులు వచ్చే అవకాశం ఉన్నందున పనులు మొదలు పెడతారని తెలిపారు.



పూర్తిగా కంకర లేచిపోయిన దృశ్యం



రోడ్డు పక్కకు జారిపోయిన కంకర

గోవధ చట్టరీత్యా నేరం

ఒంటిమిట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గోవధ చట్టరీత్యా నేరమని పశుసంవర్ధకశాఖ ఏడీ ఉమ పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడా ఆవులు, దూడలు, ఒంటెలను వధించడం నిషేధమన్నారు. స్థానిక పశువైద్యశాలలో డాక్టర్ రమ్య అందుబాటులో ఉంటారని, మండలంలో ఎక్కడైనా గోవధ నిర్వహిస్తుంటే 9701171978 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి: ఎంఈవో

రైల్వేకోడూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని ఎంఈవో-2 సుందర్‌బాబు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో మెలగాలని, విద్యపై ఏకాగ్రత కలిగిఉండాలన్నారు. అనంతరం డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పెట్టుబడి సాయం అందించాలి

రాయచోటిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించడానికి పెట్టుబడి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రూ.2 లక్షల వరకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలను కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

రాజంపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌ను గుంతకల్ రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శుక్రవారం సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, వాటి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే సుందరీకరణ కోసం అమృత భారత్‌లో చేర్చి కోట్ల నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులు కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉండడంతో వాటిని అధికారులతో కలిసి రాజంపేటను సందర్శించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

రాజంపేట టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మదనగోపాలపురం పంచాయతీలోని చెత్తనుండి సంపద సృష్టి కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని గృహాలున్నాయి, చెత్తసేకరణను ఎంతమంది చేస్తున్నారు, రోజు ఎంతమేర చెత్త వస్తుంది, వచ్చిన చెత్తను ఎక్కడ వేస్తున్నారు, తడి, పొడిచెత్త వేర్వేరు చేస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ తప్పనిసరిగా చేయాలని, సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ చేయాలని సూచించారు. ఏవో బాలము నిస్వామి, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

నందలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గంగాపూజ, గోపూజ, గణపతిపూజ, మంగళహారతి, సాయంత్రం ప్రదోషకాల పూజలు, దీక్షాహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సుధాకర్ మాట్లాడుతూ శనివారం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు, సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకం ఎంతో ఉపయోగకరం

నందలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకం ఎంతో ఉపయోగకరమని ఎంపీడీవో రాధాకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ పథకంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఆన్‌లైన్ దరఖాస్తు నేషనల్ పోర్టల్‌లో సమర్పించవచ్చునన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే నెలకు దాదాపు 125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, కాబట్టి వినియోగదారులు డిస్కౌంట్ నుంచి కనీస విద్యుత్ బిల్లులు మాత్రమే చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్యానెళ్లు సూర్యుడి వేడిని తీసుకోవడం ఇల్లు చల్లగా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఐదు నుంచి ఆరు సంవత్సరాల్లోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారని తెలిపారు.




నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి - విజయదుర్గ

శ్రీవారి సేవలో మాజీ సీఎం నల్లారి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి సోదరి, నటుడు సాయిధరమ్‌తేజ్ తల్లి విజయదుర్గ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా దర్శనానికి ముందు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సుప్రభాత సేవలో విజయేంద్ర సరస్వతి



కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మఠం ఉత్తరాధికారి సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతితో కలిసి శ్రీవారి ఆలయంలో వేకువజాము జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత శ్రీవారి పుష్కరిణిని సందర్శించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,284

తలనీలాలు సమర్పించినవారు: 31,268

రేపటి నుంచి యూపీఎస్సీ ఇంజనీరింగ్ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు(ప్రిలిమనరీ) ఆదివారం నుంచి నిర్వహించనుండడంతో డీఆర్వో నరసింహులు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 791మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అందుకు తగినట్లు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పేపర్ 1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

తిరుపతిలో మత్తు ఇంజెక్షన్ల కలకలం

- ఆగమేఘాల మీద ఘటనా స్థలం పరిశీలన
- అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు



కూరాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో కలకలం రేగింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ, పోలీసులతో కలసి ఘటనా స్థలానికి వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలు, మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు వచ్చిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. దాదాపు 40 నిమిషాల పాటు అక్కడే ఉండి కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఎవరికైనా మత్తు ఇంజెక్షన్లు కనపడ్డాయా? ఎవరనా చూశారా అని అడిగారు. అయితే వైరల్ అయిన వీడియోను పరిశీలించిన ఎస్పీ అది ఇప్పటిది కాదని తేల్చారు. కానీ భవిష్యత్తులో కూరగాయల మార్కెట్‌లో నిషేధిత వస్తువులు, మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాల ఉనికి కనపడకుండా ఉండడానికి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 112 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జిల్లా అధికారులు ఆకాంక్షించారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన టోకెన్ల జారీ



దివ్యదర్శనం టోకెన్లు పొందుతున్న శ్రీవారి మెట్టు కాలిబాట భక్తులు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన(డీడీ) టోకెన్ల జారీని టీటీడీ ప్రారంభించింది. ఈసందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు దివ్యదర్శన టోకెన్ కేంద్రాన్ని శ్రీవారిమెట్టు నుంచి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్ల ఏర్పాటుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లు జారీ చేసే మౌలిక సదుపాయాలు ఉండటంతో డీడీ టోకెన్ల జారీని ప్రారంభించామన్నారు. శ్రీవారిమెట్టు డీడీ టోకెన్ల జారీ చేయడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, టీటీడీ ఏర్పాట్లపై భక్తులు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రవాణా వ్యవస్థ కూడా బాగా ఉందని, బస్టాండ్ కూడా అలిపిరిలోనే ఉందన్నారు. దీంతో భక్తులు శ్రీవారిమెట్టుకు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు శ్రీవారి సేవా వలంటీర్లతో పాటు పరిపాలన నిఘా, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా డీడీ టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యదర్శన టోకెన్లను పరిశీలిస్తున్న అదనపు ఈవో

చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో

సిట్ దర్యాప్తులో తేలుతుంది

- వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడం నీ నైజం
- కక్ష సాధింపు కాదు.. మీ అవినీతిపై చట్టపరంగానే చర్యలు
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 6(ఆంధ్రజ్యోతి): చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో సిట్ దర్యాప్తులో తేలుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నీ గన్‌మేన్ గిరిని బెదిరించి తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వమన్నారంటూ హడావిడి చేయడం.. గుమ్మడికాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సానుభూతి, పబ్లిసిటీ కోసం ముందస్తుగానే ఇలాంటివి చేయడం సరికాదన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కసిరెడ్డితో స్నేహం లేకపోతే టీటీడీ బోర్డుకు ఆయన పేరు ఎందుకు సిఫార్సు చేశావంటూ ప్రశ్నించారు. 'నీపై 87కేసులు పెట్టారంటూ చెబుతున్నావు. అవన్నీ టీడీపీ ప్రభుత్వంలో కాదు.. కాంగ్రెస్ హయాంలో పెట్టినవే. వైసీపీ ప్రభుత్వంలో నాపై ఎన్నో కేసులు పెట్టారు. మేము తప్పు చేస్తే ఏ జైలుకైనా వెళ్లడానికి సిద్ధం. వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేసే నైజం నీది. ఈ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు. మీ అవినీతికి సంబంధించిన ఆధారాలు చాలా ఉన్నాయి. అవన్నీ చట్టం చూసుకుంటుంది. ఇకనైనా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో. నువ్వు తప్పు చేయలేదంటే ఎవరూ నిన్ను టచ్ చేయరు. నువ్వెంత అవినీతి చేశారో అందరికీ తెలుసు. అరెస్టయితే సింపతీ వస్తుందని అనుకుంటున్నావేమో? అలాంటి పరిస్థితి ఉండదు' అని పులివర్తి నాని స్పష్టంచేశారు. బియ్యం మాఫియాలో మీ కుటుంబానికి ఎంత ముడుపులు చేరాయో త్వరలోనే బయటకు వస్తుందని చెవిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కంటైనర్లలో డబ్బులు దొరికిన విషయాన్ని గుర్తు చేశారు.ఆ డబ్బులు తమవి కాదంటూ చెవిరెడ్డి బుకాయిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవద్దని, అవసరమైతే సలహాలు ఇవ్వాలని సూచించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది కాలంలో తాను ఎన్నో అభివృద్ధి పనులు చేపడితే.. చేయలేదంటూ పత్రికల్లో రాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, గౌస్ బాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మాఫియాలో నన్ను ఇరికించే కుట్ర

- తప్పుడు వాంగ్మూలం కోసం సిట్ ఒత్తిడి తెస్తోందన్న చెవిరెడ్డి



తిరుపతి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తనను ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులో నివాసమున్న తన ఆత్మీయుడు వెంకటేష్, ఆయన భార్య, ఏడాది వయసున్న కుమారుడిని సిట్ అధికారులు తమ కార్యాలయంలో బంధించి భయపెడుతున్నారని ఆరోపించారు. సిట్ తయారు చేసిన తప్పుడు స్టేట్‌మెంట్‌లో సంతకం పెట్టకుంటే ఏదో ఒక కేసులో ఇరికించి జీవితాంతం జైల్లో ఉండేలా చేస్తానంటూ వెంకటేష్‌ని ఏఎస్పీ శ్రీనివాస్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. అప్పటికీ ఆయన సంతకం పెట్టకపోవడంతో ప్రలోభపెడుతున్నట్టు ఆరోపించారు. వెంకటేష్ కుటుంబీకులతో పాటు ఆయనవద్ద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులనూ తీసుకెళ్లి హింసిస్తున్నారన్నారు.

వైభవం.. గోవిందుడి గరుడోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు





తిరుమల ఆలయం నుంచి తీసుకొచ్చిన ఆభరణాలు - పల్లకి వాహనం

తిరుపతి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడసేవ జరిగింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడసేవ 10 గంటల వరకు కొనసాగింది. వజ్ర, వైఢూర్యాలు, విలువైన బంగారు ఆభరణాలు, సహస్రకాసుల హారాలు, నూతనంగా అందజేసిన నగలతో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. గోవిందనామ స్మరణలతో అడుగడుగున భక్తజనం కర్పూర నీరాజనం సమర్పించారు. ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను మురిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన సేవల ముందు కోలాటాలు, చెక్కభజనలు, కేరళాడ్రమ్స్, కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గరుడసేవ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి రూ.34.46లక్షల విలువచేసే మూడు బంగారు ఆభరణాలను కానుకగా అందించారు. దీర్ఘచతుర ప్రాకార పతకం, అమ్మవార్ల దీర్ఘచతుర ప్రాకార రెండు పతకాలను శాశ్వత ప్రాతిపదికన టీటీడీ బహూకరించింది. తిరుమల బేడిఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ ఆభరణాలను ఊరేగింపుగా డిప్యూటీ ఈవో లోకనాథం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరికా.. మాకేంటి?

- బోర్డు పీకేసి భూమిని కొట్టేసేందుకు భారీ స్కెచ్

'ఈ భూమి కొత్తపాలెం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-99లో ఉంది. ఇది ప్రభుత్వ భూమి. ఇందులోకి ప్రవేశించుట నిషిద్ధం. అట్లు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రేణిగుంట తహసీల్దారు పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇది. దీనిని పీకి పడేసి ఆక్రమణకు యత్నిస్తున్నారు.



పాత విమానాశ్రయం రోడ్డులో కబ్జాకు యత్నిస్తున్న భూమి




ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ నిర్మించేందుకు తోలిన రాయి - రెవెన్యూ హెచ్చరిక బోర్డును పడేసిన దృశ్యం

రేణిగుంట మండలం పాత విమానాశ్రయం ఆనుకొని ఆరు లేన్ల జాతీయ రహదారి రావడంతో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కళ్లు పడింది. దీంతో కోట్ల విలువైన ఆ భూములను ఆక్రమించేందుకు రెండు వర్గాలు దిగాయి. ఒక వర్గం ఆ భూమి తమదంటే, కడప జిల్లాకు చెందిన మరో వర్గం తమదంటున్నాయి. తమకంటే తమకు డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. ఆలస్యంగా మేలుకున్న రెవెన్యూ అధికారులు సదరు భూమిలో హెచ్చరికలు బోర్డు పెట్టారు. అయితే కొత్తపాళేనికి చెందిన వ్యక్తి ఐదు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటామని గతంలో అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ దగ్గర దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం సమీపంలో ఉండడంతో దరఖాస్తును రద్దు చేశారు. దీంతో ఈ భూమిలో సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఆర్డీవో సహా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ భూమి వద్దకు రోజుకు ఒకరు వచ్చి పోతుండడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిని శుభ్రం చేయడంతో మూడుసార్లు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అయితే మూడుసార్లూ దాన్ని తొలగించారన్నారు. ఇకపై ఎవరైనా భూమిలో ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

పారిశ్రామిక అవసరాలకు స్టాండ్‌రీచ్ ప్యానల్స్

- ఈ ప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ట్ పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా తదితరులు

తడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు అవసరమయ్యే స్టాండ్‌రీచ్ ప్యానల్స్‌ను తయారు చేస్తున్నామని ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ, సీఈవో సంజాయ్ సింగానియా అన్నారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లో సుమారు రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ఫుడ్ ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ వంటి వాటికి అవసరమైన స్టాండ్‌రీచ్ ప్యానల్స్ పెరుగుతున్న డిమాండ్‌కు తమ పరిశ్రమ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. తమ పరిశ్రమ ద్వారా ఏడాదికి 8 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని దానిని 13.10 లక్షల చదరపు మీటర్లకు చేర్చేలా తమ పరిశ్రమ పనిచేస్తుందన్నారు. దేశంలోనే పర్యావరణ హిత నిర్మాణ పరిష్కారాలకు తమ ఉత్పత్తులు ఎంతో మెరుగైనవని చెప్పారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 730 మందికి.. మరి కొద్ది రోజుల్లోనే 900 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 2023లో తమ పరిశ్రమ 1.51 లక్షల చదరపు అడుగుల నిర్మాణాన్ని 50 గంటల్లోనే పూర్తిచేసి గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు సాధించిందన్నారు. తమ పరిశ్రమకు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని అనుమతులతో అత్యంత నాణ్యతతో ప్యానల్స్‌ను ఉత్పత్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చైర్మన్ భజరంగ్‌బోత్ర, ఈడీ నిఖిల్ బోత్ర, పీఆర్వో ఆజామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీలో

జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు అవగాహన

ఏర్పేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో అర్హత పొందిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ప్రారంభమవుతుంది. డైరెక్టర్, డీన్లు, విభాగాధిపతులతో అభ్యర్థులు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించారు. తరువాత క్యాంపస్ విజిట్ ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, డబుల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు విధానం, హాస్టల్ వసతి, వైద్య సౌకర్యాలు తదితరాలపై అవగాహన పొందవచ్చు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌ద్వారా హాజరయ్యే అవకాశం ఉంది. వివరాలకు నెం. 0877-2503532లో సంప్రదించవచ్చు.

ఉత్తరాఖండ్ శిక్షణకు జడ్పీ సీఈవో ఓబులమ్మ

● డిప్యూటీ సీఈవోకు ఇన్‌చార్జ్ సీఈవోగా బాధ్యతలు

కడప రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (జడ్పీ సీఈవో) సి.ఓబులమ్మ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో 5 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణకు హాజరవుతున్నారు. ముస్సోరీలోని లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ వారు (ఎల్‌బీఎస్ఎన్ఏఏ) జూన్ 9 నుండి 13 వరకు పంచాయతీరాజ్ సంస్థలు, గ్రామీణాభివృద్ధిలో పాలన క్లిష్టమైన సమస్యలు అనే అంశంపై ఇన్-సర్వీస్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈమేరకు రాష్ట్రంలో పీఆర్ అండ్ ఆర్డీ విభాగంలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు గానీ లేక జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులలో ఇద్దరు అధికారులను నామినేటెడ్ చేయాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్‌ను కోరారు. ఈమేరకు ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ నుంచి ఇద్దరు సీఈవోలను నామినేటెడ్ చేశారు. అందులో కడప జిల్లా, విశాఖపట్నం జడ్పీ సీఈవోలు సి.ఓబులమ్మ, పి.నారాయణమూర్తిలను సూచించారు. పైన పేర్కొన్న శిక్షణా కార్యక్రమానికి హాజరు కావడానికి సీఈవో ఓబులమ్మ వెళ్లారు. శిక్షణ ముగింపు వరకు డిప్యూటీ సీఈవో మైథిలికి ఇన్‌చార్జ్ సీఈవోగా బాధ్యతలను అప్పగించారు.

లక్ష ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్

● విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

కడప మారుతీనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు లక్ష గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ అన్నారు. ఇందులో భాగంగా కడప విద్యుత్ భవన్‌లోని తన చాంబరులో బ్యాంకర్లు, అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. బ్యాంకర్ల సలహాలు మెండుగా ఉండాలన్నారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్‌ను, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీతో ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవడమే కాకుండా తిరిగి మిగులు విద్యుత్ యూనిట్‌కు రూ.2.09 వంతున పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పొంది సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్దన్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యలారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మధుసూదన్, హరిసేవ్యనాయక్, భరణిక్రిష్ణ, ప్రసాద్‌రెడ్డి, డీఈఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీటీఐ, టీటీఐల పనితీరు అభినందనీయం

● చీఫ్ కమర్షియల్ మేనేజర్ రమేష్‌బాబు



ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌తో సీటీఐ, టీటీఐలు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీటీఐ, టీటీఐల పనితీరు అభినందనీయమని ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో టిక్కెట్లు లేకుండా రైల్లో ప్రయాణిస్తున్న వారిని గుర్తించి వారి ద్వారా అపరాధ రుసుం వసూలు చేసి రైల్వేకు రికార్డు స్థాయిలో ఆదాయాన్ని తీసుకువచ్చిన కడపకు చెందిన పలువురు చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లు (సీటీఐ), ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్లు (టీటీఐ)లకు ప్రశంసాపత్రాలను అందించారు. కడప రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్‌కు చెందిన సీటీఐలు ద్వారకనాథరెడ్డి, నరసింహారెడ్డి, మహబూబ్ బాషలతో పాటు టీటీఐలు రాజశేఖర్, హరికిశోర్‌రెడ్డి,రమేష్ రాఘవేంద్రారెడ్డి, చైతన్యబాబు, ప్రసన్నకుమార్‌లు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

ప్రతిష్ఠలో అపశ్రుతి... ముక్కలైన ధ్వజస్తంభం



కనుపర్తిలో ప్రతిష్ఠ సందర్భంగా ముక్కలైన ధ్వజస్తంభం

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపర్తి గ్రామంలో శుక్రవారం ధ్వజప్రతిష్ఠలో అపశ్రుతి జరిగింది. రాతి ధ్వజస్తంభం ప్రతిష్ఠించే సమయంలో మూడుముక్కలుగా విరిగింది. దీంతో భక్తులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చాలా ఏళ్లక్రితం గ్రామంలో బండ్లపల్లె కుటుంబీకులు ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. గతంలో ఈ ఆలయానికి చెక్క ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఇది కాలక్రమంలో చెదలుపట్టింది. దీంతో రాతి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు ఆళ్లగడ్డ నుంచి రూ.3లక్షలు వెచ్చించి 36 అడుగుల పొడవు ఉన్న ధ్వజస్తంభం తీసుకువచ్చారు. ప్రతిష్ఠ చేసేందుకు శుక్రవారం క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ఎత్తుతుండగా మూడు ముక్కలుగా విరిగింది.

ఉరి వేసుకుని వివాహిత మృతి



తేజశ్రీ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎంత వారించినా భర్త మద్యం తాగేది ఆపకపోవడంతో ఓ వివాహిత ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకుంది. మదనపల్లె పట్టణం బీకేపల్లె కాలనీకి చెందిన శివకేశవ, రెడ్డెమ్మ కుమార్తె కె.తేజశ్రీ(23)ని కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాకు చెందిన రఘుతో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. వారు స్థానిక నీరుగట్టువారిపల్లెలో నివాసముంటున్నారు. ఏడాది క్రితం వారికి ఓ కుమారుడు పుట్టాడు. కాగా, రఘు నిత్యం మద్యం సేవిస్తుండటంతో తేజశ్రీ వారి స్తూ వుండేది. గురువారం రాత్రి ఇంటి వద్ద రఘు మద్యం సేవిస్తుండగా, అతనితో తేజశ్రీ గొడవపడింది. అయినా, అతను మద్యం తాగేది ఆపకపోవడంతో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టు టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ల పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (3, 5 సంవత్సరాల), 3,5,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ చంద్ర ఓబుళరెడ్డి శుక్రవారం పరిపాలన భవనంలో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్‌లో 81 శాతం ఫలితాలు, ఐదో సెమిస్టర్‌లో 76శాతం, ఏడో సెమిస్టర్‌లో 61శాతం, తొమ్మిదో సెమిస్టర్‌లో 91.67శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిం చారని వివరించారు. ఎల్ఎల్‌బీ మూడు సంవత్సరాల కోర్సు 3వ సెమిస్టర్‌లో 23.81 శాతం, 5వ సెమిస్టర్‌లో 88.24శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని రిజిస్ట్రార్ అభినందించారు.

41 చీనీ చెట్ల నరికివేత



నరికిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనమల చింతల గ్రామంలో గురువారం రాత్రి ప్రసాద్ అనే టీడీపీ కార్యకర్తకు చెందిన 41 చీనీ చెట్లను నరికివేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి వివరాల మేరకు.. ప్రసాద్ శుక్రవారం ఉదయం తన తోట వద్దకు వెళ్లగా మూడు సంవత్సరాల వయసు గల 41 చీనీ చెట్లను నరికివేసినట్లు గమనించాడన్నారు. దీంతో తమకు ఫిర్యాదు చేయగా చీనీ తోటను పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిరికిపంద చర్య... భూపేశ్‌రెడ్డి

టీడీపీ కార్యకర్త ప్రసాద్‌కు చెందిన 41 చీనీ చెట్లను నరికివేయడం పిరికిపంద చర్య అని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయింత్రం ఎనమల చింతల గ్రామంలో నరికిన చీనీచెట్లను ఆయన పరిశీలించారు. ఇది కుట్రపూరితంగానే జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి చర్యలతో తమ కార్యకర్తలను మానసికంగా దెబ్బతీయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కూటమి నాయకులు శివనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లావనూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరులోపు పంచాయతీలకు శుద్ధినీరు సరఫరా



వాటర్ గ్రిడ్‌పనులను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లింగాల, సింహాద్రిపురం మండలాల్లోని 30 పంచాయతీలకు ఈ నెలాఖరులోగా వాటర్ గ్రిడ్ ద్వారా శుద్ధినీటి సరఫరా చేస్తామని జల్‌జీవన్ మిషన్ పులివెందుల, కేంద్ర ఫర్టిలైజర్ అండ్ నోడల్ ఆఫీసర్ ముఖేష్ మేఘ్వాల్, డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ టెక్నికల్ ఆఫీసర్ నవనీత్ ఉపాధ్యాయ అన్నారు. లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రయల్ రన్‌పూర్తిచేసి నెలాఖరులోగా 30 పంచాయతీలకు నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గీత

మదనపల్లె టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో చదువుతున్న శివాని గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన నవోదయ పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల క్రీడలు) షాట్‌పుట్ విభాగంలో మూడు గోల్డ్ మెడల్స్, జావెలిన్ త్రోలో నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించిందని ప్రిన్సిపాల్ గీత తెలిపారు. మరో విద్యార్థిని చందన హ్యాండ్ సైక్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చనిపోయిన వ్యక్తి పేరుతో సర్వేకు చలానా

రాయచోటి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల క్రితం చనిపోయిన తన తండ్రి పేరు మీద కోర్టు కేసులో ఉన్న భూమి సర్వే కోసం ప్రతివాది చలానా కట్టిన విషయమై గురువారం తుమ్మగింజల వెంకటరమణ రాయచోటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని మాధవరం గ్రామంలోని సర్వే నెంబరు 891/3లోని 2.65 ఎకరాల భూమి విషయమై కోర్టులో మా తండ్రి తుమ్మగింజల చిన్నగంగులు, కదిరి రామచంద్ర మధ్య వివాదం నడుస్తోంది. మా తండ్రి 2015 లో చనిపోయారు. దాంతో నేను ప్రతివాదిగా ఉన్నాను. అయితే ఇటీ వల కదిరి రామచంద్ర ఆ భూమి సర్వే కోసం చలానా మా తండ్రి పేరు మీద కట్టి.. అధికారులను తప్పుదోవ పట్టించాలని చూశాడు. కాబట్టి.. ఆ చలానా విషయమై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడిపై దాడి... తీవ్ర గాయాలు



కడప క్రైం, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): ఖాజీపేట మండలం ముత్తలూరుపాడు దళిత వాడకు చెందిన పిచ్చిమల్లుగాళ్ల శివాజీ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో శివాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు... శివాజీకి చెందిన స్థలంలో వీధిలైట్ల స్తంభాలు నాటే విషయమై కత్తి వెంకటరమణ, కత్తిశేఖర్, కత్తి గిరి, కత్తి అడవి రాముడు, కైలాస్ దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో శివాజీ తలకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రిమ్స్ ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి.. ఖాజీపేట పోలీసు స్టేషన్‌కు బదలాయించారు.

మోసం చేశారని ఫిర్యాదు

పులివెందుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తన తండ్రికి సంబంధించిన స్థలం విషయంలో ఐదుగురు సభ్యులు మోసం చేశారంటూ పులివెందులకు చెందిన దుష్యంత్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్బన్ ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల మేరకు.. దుష్యంత్‌రెడ్డి తండ్రి విజయభాస్కర్‌రెడ్డికి బెంగుళూరులో 50సెంట్ల స్థలం ఉందన్నారు. ఆ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు ఐదుగురిని సభ్యులుగా చేసి రిజిస్ట్రేషన్ ఆఫ్ పవర్ ఇచ్చారన్నారు. అయితే ఇటీవల విజయభాస్కర్‌రెడ్డి మృతి చెందారు. అనంతరం దుష్యంత్‌రెడ్డి తండ్రి ఇంట్లో స్థలానికి సంబంధించిన పత్రాలు బయట పడ్డాయన్నారు. ఈ పత్రాలకు సబంధించిన వివరాలు దుష్యంత్‌రెడ్డి సేకరించగా అసలు విషయం బయటపడిందన్నారు. అభివృద్ధి చేసేందుకు ఇచ్చిన స్థలంలో వచ్చిన డబ్బును ఐదుగురు సభ్యులు పంచుకున్నారని, తన తండ్రికి ఇవ్వలేదని, ప్రస్తుతం ఆ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారని గుర్తించారు. దీంతో ఐదుగురు మోసం చేశారని గుర్తించి దుష్యంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఆటో రిక్షా దగ్ధం

వేంపల్లె, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులో ఉన్నట్లుండి ఆటోరిక్షా దగ్ధమైంది. స్థానికంగా ఉన్న రహంతుల్లా ఆటో రిక్షాలో మూటలు, ఇతర వస్తువులు తరలిస్తూ జీవనం సాగించే వాడు. గురువారం రాత్రి పులి వెందుల రోడ్డులోకి వెళ్తుండగా ఉన్నట్లుండి ఆటో రిక్షా నుంచి మంటలు వచ్చాయి. నిమిషాల్లోనే పెద్దఎత్తున మంటలు చెలరేగి దగ్ధమవుతుండగా స్థానికుల సహకారంతో నీళ్లుచల్లి మంటలను ఆర్పివేశాడు. జీవనాధారమైన ఆటోరిక్షా ప్రమాదశాత్తు కాలిపోవడంతో ఉపాధి కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పెద్దతిప్పసముద్రం జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టపై వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధులు కోసం విగ్రహాన్ని తొలగించి పెద్ద గుంతను త్రవ్వేవారు. దీంతో పాటు ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభాన్ని సైతం పక్కకు తోసేసి అక్కడ కూడా తవ్వేశారు. శుక్రవారం గొర్ల కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించి పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా పల్నాడు అంకాలమ్మ ఉత్సవాలు

● ముళ్లకంపలో దొర్లిన భక్తులు



ముళ్లకంపలో దొర్లుతున్న భక్తులు

బి.కోడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెంలో పల్నాడు అంకాలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి దండకం చదివి పొట్టేలును బలి ఇచ్చి పేగులను ముళ్లకంపకు చుట్టారు. అంకాలమ్మ, చెన్నకేశవుడి విగ్రహాలతో భక్తులు కంపల్లో దొర్లారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు రావడంతో బి.కోడూరు ఎస్ఐ వెంకటసురేశ్ గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలను బద్వేలు ఇన్‌చార్జి రితేశ్‌రెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన దార్వేల గుర్విరెడ్డి ఎద్దులు రూ.లక్ష గెలుచుకున్నాయి. అలాగే రెండో బహుమతి మైదుకూరు పట్టణానికి చెందిన వెంకటేశ్‌యాదవ్‌కు రూ.80వేలు దక్కింది. మూడో బహుమతి రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డికి రూ.50వేలు ఆలయ కమిటీ సభ్యులు అందించారు. రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నదానం నిర్వహించారు. పల్నాడు అంకాలమ్మ తల్లిని శుక్రవారం బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు ఇన్‌చార్జ్ రితేశ్‌రెడ్డి, పీసీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. వీరివెంట సీనియర్ టీడీపీ నాయకులు ఓ.జయరామిరెడ్డి, కల్లూరు క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చల్లని దొర

వీరపునాయునిపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన అనిమెల ఆంజనేయులు (51) హత్య కేసులోని నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పెండ్లిమర్రి సీఐ చల్లని దొర విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంజనేయులుకు నిందితుల మధ్య గోడ స్థలం, భూముల విషయమై తగాదాలు ఉండేవి. ఇది మనసులో పెట్టుకున్న నిందితులు బెలుకూరి నరేష్, బెలుకూరి నవీన్‌కుమార్, శ్రీరాముల బోగాది, బెలుకూరి రెడ్డిమహేష్‌లు గత 27వ తేదీ ఎస్సీ కాలనీ సందులో ఆంజనేయులు ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా రోకలబండతో కొట్టి హత్య చేసి పారిపోయారన్నారు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి.. నిందితులను 5వ తేదీ సాయంత్రం అరెస్టు చేశామని తెలిపారు. వీరిని కమలాపురం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మంజునాథ్, పోలీసులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు



కమలాపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామం పొలాల మధ్యలో కోడిపందేలు నిర్వహిస్తున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గంగవరం గ్రామాన్ని ఆనుకుని పెన్నానది పరివాహక ప్రాంతంలో కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. మధ్యాహ్నం సుమారు 1.30గంటల ప్రాంతంలో దాడి చేసి 11 మంది వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఐదు పందెం కోడిపుంజులను, రూ.20,200 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బుగ్గల నాగేంద్ర (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఎస్ఆర్‌పాలెం సమీపంలో బుగ్గల నాగేంద్ర(38) ప్రమాదవశాత్తు ఆటో నుంచి పడి తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. నాగేంద్ర భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రాయచోటి సమీపంలో ఉన్న చిన్నమండెం వద్ద ఉన్న అత్తగారింట్లో వదిలి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం సంభవిం చింది. అతివేగంతో వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.... ములకలచెరువుకు చెందిన సులోచన(22) భర్త రాజేంద్రకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వైద్యం చికిత్సలు చేయించి ఆర్థికంగా చితికిపోయింది. ఆ కష్టం గట్టెక్కేలోపే కుమారుడుకు కాలు విరిగింది. దీంతో ఆమెకు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో జీవితం మీద విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగ గడ్డి వామి దగ్ధం

పెండ్లిమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లయ్యగారిపల్లెలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో శివరామిరెడ్డి అనే రైతుకు చెందిన వేరుశనగ గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగరాని నష్టం జరిగిందని.. దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందన్నారు.

శేష వాహనంపై నృసింహుడు


శేష వాహన సేవలో లక్ష్మీనరసింహ స్వామి

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం స్వామి వారు శేష వాహనంపై దర్శన భాగ్యం కలిగించారు. సూర్యోదయాత్పూర్వమే స్వామి వారికి అర్చన, అభిషేకాలు పూర్తి చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పల్లకీ సేవ ఏర్పాటు చేశారు. ప్రత్యేక అలంకరణతో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక ఆర్య వైశ్య సంఘం ఈ శేషన వాహనం నిర్వర్తించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి శేష వాహన సేవలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరాచార్యులు స్వామి వారి కైంకర్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విశేష పూజలందుకుంటున్న బోయకొండ గంగమ్మ దేవత

వాల్మీకిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తోట వీధి ప్రాంతం ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొత్తగా నిర్మించిన ఆలయంలో బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా హోమాలు, మహాకుంభాభిషేకం, అష్టబంధన, విమాన గోపురం, గణపతి పూజ, గోపూజ తదితర కార్యక్రమాలు వేడుకగా సాగాయి. శుక్రవారం ఉదయం ద్వారతోరణ ధ్వజ కుంభ కలశాధారణ, ప్రాణ ప్రతిష్ఠ హోమం, శాంతి హోమం, తదితర కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠానంతరం మహా కుంభ ప్రోక్షణ, పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మహామంగళ హారతి అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మెన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్రారెడ్డి, నేతలు పీవీ నారాయణ, రమేష్, కేకేనాయుడు, బొక్కసం బ్రదర్స్, వేదపండితులు కృష్ణప్రసాద్‌భట్టర్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టండి


ప్రజావేదికలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


మదనపల్లె టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ వడ్డిపల్లెలో తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేయగా, ప్రత్యామ్నాయంగా కొత్తబోరు డ్రిల్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మదనపల్లె, రామసముద్రం మండలాల్లో కూడా కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య వచ్చే పరిస్థితి వుందని, ఆయా మండలాల ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో పట్టణ మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడు తూ ఇప్పటికే గ్రామ సమాఖ్యల సమావేశాలకు స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించామని, పట్టణ మహిళా సంఘాల సమావేశాలకు కూడా స్థలాలు ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచనలిచ్చామన్నారు. జనసేన, టీడీపీ నేతలు రామాంజనేయులు, నాదెళ్ల శివన్న, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై ప్రజలకు వివరించండి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

మదనపల్లె టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ 11 ఏళ్లపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద నిర్వహించిన జిల్లా కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్లుగా అందిస్తున్న సుపరిపాలనతో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి బీజేపీ నేతలు అన్ని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, నేతలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరాజు, భగవాన్, బండి ఆనంద్, స్వామినాయక్, వెంకటరమణారెడ్డి, కిరణ్, కృష్ణప్ప, పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకునేందుకే ప్రభుత్వం : ఎమ్మెల్యే


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా ఆపన్నులను ఆదుకోవడానికే సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరిపల్లెలో పలు మండలాలకు చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు రూ.18,27,782ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బాధితులు, వాల్మీకిపురం మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కంభం నిరంజన్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

డ్రై డేతోనే దోమలను కట్టడి చేయొచ్చు

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే'ను పాటించడంతోనే దోమల వ్యాప్తిని నిరోధించవచ్చని మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప, డీహెచ్ఈఓ మహ్మద్ రఫీ పేర్కొన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్, మలేరియా మాసోత్సవాల సందర్భంగా మేడికుర్తిలో నిర్వహించిన స్వయం సహాయ సంఘాల అవగాన కార్యక్రమంలో మాట్లాడుతూ వంద రోజుల టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి మద్యం పొగతాగే వారిని, గతంలో టీబీ వ్యాధి సోకి స్వస్థత చేకూరిన వారిని, బీఎంఐ 18కంటే తక్కువ వున్న వారిని, దీర్ఘకాలిక జబ్బులున్న వారిని, చక్కెర వ్యాధిగ్రస్తులను, గర్భిణులను గుర్తిస్తామన్నారు.

ప్రారంభించారు... పక్కన పెట్టారు

నిరుపయోగంగా బాలికల హాస్టల్ భవనం ● రూ. 65 లక్షలు వృథా ● పట్టించుకోని అధికారులు

పీలేరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ. 65 లక్షలు ఖర్చుతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించి ఎంపీ మిథున్ రెడ్డి ద్వారా అట్టహాసంగా ప్రారంభించినా చివరికి అధికారుల నిర్లక్ష్యానికిగురై నిరుపయోగమైంది. ఫలితంగా పేద విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడంలేదు. వివరాల్లోకెళితే...

గ్రామీణ ప్రాంత విద్యార్థినులు డిగ్రీ చదివేందుకు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుకూలం. అయితే బాలికల సౌలభ్యం కోసం హాస్టల్ భవనం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో అప్పటి ఉమ్మడి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ద్వారా బాలికల హాస్టల్ భవనం మంజూరు చేయించారు. వెంటనే రూ. 65 లక్షలు యూజీసీ ద్వారా నిధులు మంజూరు చేయడం, ఆయనే స్వయంగా భూమి పూజ చేయడం కూడా వేగంగా జరిగింది. అనంతరం మారిన రాజకీయ సమీకరణల్లో భాగంగా హాస్టల్ భవన నిర్మాణం నత్తనడకన సాగింది. అనేక ఒడిదుడుకుల నడుమ వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణం పూర్తి చేసుకుంది. 2022 సెప్టెంబరు 9న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భవనాన్ని ప్రారంభించారు. ఆధునిక వసతులతో బాలికలకు హాస్టల్ వసతి అందుబాటులోకి వస్తుందని గొప్పగా ప్రకటించారు. దీంతో వసతి గృహం అందుబాటులోకి వస్తుందని, పేద విద్యార్థినులు డిగ్రీ చదివేందుకు అవకాశం మెరుగుపడుతుందని సంబరపడ్డారు. ఆర్భాటంగా భవనాన్ని ప్రారంభించినా వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులు నిర్లక్ష్యానికి గురవడంతో భవనం నిరుపయోగంగా మారింది. లక్ష్యం ఉన్నతమైనా అధికారులు, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో బాలికలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా వసతి గృహం ప్రారంభించడంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాగే వదిలేస్తే అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారే అవకాశం లేకపోలేదు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలికల హాస్టల్ భవనం - ప్రారంభోత్సవ శిలాఫలకం

ఉచితంగా హాస్టల్ నిర్వహించలేం

సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్మించిన హాస్టల్‌ను ఉచితంగా నిర్వహించలేమని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి వివరించారు. అంతేకాకుండా విద్యార్థులు డబ్బు చెల్లించి హాస్టల్ మెయింటెనెన్స్ చేసుకునే వాళ్లు ఉంటే అవకాశం కల్పిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ హాస్టల్ నిర్వహణ కోసం భవనం అద్దెకు ఇవ్వగలం. ఈ విషయమై కలెక్టర్‌కు రెండు పర్యాయాలు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక


ఎస్.అర్షద్ - మధుప్రియ - బాలాజి

తంబళ్లపల్లె/గుర్రంకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్‌స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఎస్.అర్షద్, మధుప్రియ, గుర్రంకొండ మండలం నుంచి బాలాజి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం వెంకట్రాది తెలిపారు. 2024-25లో ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఎంపికపై జరిగిన అర్హత పరీక్షలో మండలం నుంచి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఇంటర్ వరకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేలు ప్రభుత్వం అందచేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ చైర్మెన్లు అభినందించారు.

బక్రీద్ పండుగను శాంతియుతంగా చేసుకోవాలి


ఈద్గా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

బి.కొత్తకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ముస్లింలు శాంతియుతంగా సామరస్య వాతావరణంలో చేసుకోవాలని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర సూచించారు. శుక్రవారం పట్టణంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించే ఈద్గా మైదాన్‌ను ఆయన పరిశీలించారు. ప్రార్థనల సందర్భంగా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పట్టణంలో పలుకూడళ్లలో నిఘా వుంచాలని సీఐ జీవన్‌గంగానాథబాబును ఆదేశించారు.

కుల మతాలకు అతీతంగా పండుగలు, ఉత్సవాలు

కలికిరి /నిమ్మనపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పండుగలను, ఉత్సవాలను కులమతాలకు అతీతంగా సోదరభావంతో సంతోషంగా చేసుకోవాలని కలికిరి ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మండలంలోని ముస్లిం మత పెద్దలతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. గోవులను, దూడలను, ఒంటెలను వధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని సీఐ వివరించారు. గుట్టపాలెం, గుండూరు గ్రామాల్లో జరిగే జాతరల సందర్భంగా చాందినీ బండ్లు కట్టుకునే వారు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిమ్మనపల్లి మండలంలో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావణంలో చేసుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం సైదాపేట, సింగంవారిపల్లి, చల్లావారిపల్లి, నిమ్మనపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి ముస్లింలకు పలు సూచనలు చేశారు.

జేఎన్టీయూ ఇంజనీరింగ్‌లో 94 శాతం ఉత్తీర్ణత


ఇంజనీరింగ్ ఫలితాలను ప్రకటిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాలలో శుక్రవారం వెలువడిన ఫలితాల్లో మొత్తం అన్ని విభాగాలు కలిపి 74.26 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. వెంకటేశ్వర రావు వివరించారు. రెండో సంవత్సరం ఇంజనీరింగ్ సీఎస్ఈలో 93.94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కలికిరి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిన తరువాత మొత్తం ఎనిమిది పర్యాయాలు స్వీయ ఫలితాలు వెల్లడించినట్లు ఆయన చెప్పారు. ఫలితాలను కళాశాల నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.త్యాగరాజన్, అందరు విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు

మదనపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఇంజనీరింగ్ విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెలో భాగంగా విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. కార్మికులు మాట్లాడుతూ 15 ఏళ్ల సర్వీసు ఉన్న వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఉద్యోగ కాల పరిమితిని 60 నుంచి 62 ఏళ్లలకు పొడిగించాలన్నారు. కార్మికులు రెడ్డెప్ప, కన్నయ్య, నాగరాజు, గోపాల కృష్ణ, మహేష్, నారాయణ, గిరి, గంగరాజు, శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

రేపు ఘనంగా జడ్పీహైస్కూల్ స్వర్ణోత్సవాలు

పెద్దతిప్పసముద్రం జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం జడ్పీహైస్కూల్ స్వర్ణోత్సవాలు ఆదివారం నిర్వహించనున్నట్లు వేడుకల నిర్వాహకులు తెలిపారు. రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్వర్ణోత్సవాలకు గుర్తుగా పాఠశాల ఆవరణలో ఉన్న స్టేజీ నిర్మాణంతో పాటు స్టేజీకి సిమెంట్ రేకులు వేసి ఏర్పాటు చేశారు. 1974-75లో ఈ పాఠశాలను స్థాపించినట్లు తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలకు 1974-75 నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు వివిధ హోదాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు సన్మానం, సభ్యులందరికి జ్ఞాపికలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులందరికి ఆహ్వానం అని అందరు హాజరవాలని పిలుపునిచ్చారు.

పాఠశాలకు తరలిన విద్యామిత్ర కిట్లు


పాఠశాలలకు విద్యా కిట్లు తరలిస్తున్న సిబ్బంది

కలకడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు తరలింపు ప్రారంభమైనట్లు ఎంఈఓ-2 రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగ్‌లు ఉన్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజు నుంచే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

అడవి పందుల నిరోధానికి పరిష్కారాలు

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు తీవ్ర ప్రతిబంధకంగా వున్న అడవి పందులను నిరోధించి పంటను కాపాడుకోవడానికి అనేక పరిష్కార మార్గాలున్నట్లు తిరుపతి వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ సుమతి వివరించారు. శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా అడవి పందుల బెడదను నివారించవచ్చన్నారు. శుక్రవారం అద్దవారిపల్లె పంచాయతీలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన రైతు సదస్సులో ఆమె మాట్లాడుతూ పంటలను రక్షించుకోవడానికి పలు రకాల మెళకువలను సూచించారు. తిరుపతి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నవ్యజ్యోతి, పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ భారతి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ మోహన్ నీటి నిల్వ సామర్థ్యం, నువ్వుల పంట సాగు, రాగి, కొర్రలు వంటి చిరుధాన్యాల్లోని రకాలను సాగు ఆవశ్యకతలను విశదీకరించారు. కోఆర్డినేటర్ మంజుల, పశు వైద్యాధికారి గిరినాథ్, కేవీకే శాస్త్రవేత్త కె.నవీన రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణ చర్యలతో మంచి దిగుబడులు

తంబళ్లపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): టమోటాలో సమగ్ర సస్య రక్షణ చర్యలు, పోషక యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రాజానాయక్ అన్నారు. శుక్రవారం తంబళ్లపల్లెలో కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి సమన్వయ కర్త డాక్టర్ మంజుల పర్యవేక్షణలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో రైతులకు వ్యవసాయ ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. టమోటాలో సమగ్ర సస్య రక్షణ చర్యలు, పోషక యాజయాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అన్నమయ్య జిల్లా వాతావరణానికి అనుకూలమైన పండ్లు, పూలు, కూరగాయ పంటల గురించి వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త మాధురి, సిరికల్చర్ అధికారి నాగేశ్వర్ మాట్లాడుతూ వరి, వేరుశనగలో నూతన వంగడాల గురించి, పట్టు పురుగుల పెంపకంపై వివరించారు. ఏఓ రమణకుమార్, పశువైద్యాధికారి సుజనశ్రీ, ఏఈఓ పల్లవి, స్థానిక ఆర్‌ఎస్‌కే సిబ్బంది, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


కొత్త మెనూ భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సుబ్బరాయుడు

తంబళ్లపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మండలంలోని 63 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షకురాలు చంద్రకళ కొత్త మెనూ మేరకు వంటకాలను ప్రదర్శించి నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. వంట చేయడంలో మెలకువలు, పాటించాల్సిన మెనూపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌కుమార్, సీఆర్పీలు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం

రామసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని అరికెల, మినికి, కాప్పల్లె పంచాయతీల్లో శుక్రవారం జరిగిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలోనూ సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి ఇప్పటికే మండలానికి రూ.3కోట్లు ఖర్చు చేశామని మిగిలిన పనులకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి పనులు చేపడతామన్నారు. గొల్లపల్లె, గుండ్లపల్లెల్లో తాగునీటి అవసరాలకు కొత్త బోర్లు, మోటార్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్, నాయకులు రూపేష్‌రెడ్డి, సీనప్ప, రెడ్డెప్ప, కాంట్రాక్టర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ శివప్ప, స్థానికం రాజేష్, వెంకటరమణ, విశ్వనాథ్, నాగరాజ, శివారెడ్డి, పవన్‌కుమార్, శ్రీనాథ్, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలి

పీలేరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోట దానియల్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీవారి కల్యాణ మండపంలో జిల్లా స్థాయి ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు నూతన సమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తూ ముందుకు పోతున్నామని చెప్పారు. మాదిగలకు దక్కవలసిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామన్నారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ల కోసం ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు విధిగా అమలు చేయాలని కోరారు. మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, పీలేరు ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, ఏ. వెంకట్రమణ, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రిన్సిపాల్‌గా గీత

మదనపల్లె టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వలసపల్లె వద్ద వున్న నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా ఎం.గీత బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాజంపేట నవోదయ విద్యాలయ నుంచి తాను బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నవోదయ విద్యాలయలో టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికతో పనిచేస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వేళాయుధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 605 మంది హాజరు

కురబలకోట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మిట్స్, విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 605 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ ద్వారకనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ పరీక్షలకు బీఎడ్, డీఎడ్ పూర్తైన వారు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం హాజరయ్యారు. మిట్స్‌లో ఉదయం 9.30గంటల పరీక్షకు 200 మందికి 166 మంది, మధ్యాహ్నం 2గంటల పరీక్షకు 200 మందికి 157మంది, విశ్వంలో ఉదయం పరీక్షకు 160 మందికి 138 మంది, మధ్యాహ్నం పరీక్షకు 166 మందికి 157మంది హాజరయ్యారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి తొమ్మిది తరగతులు, జూనియర్ ఇంటర్‌లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10 నుంచి 20వ తేదీలోగా https://apms.apcfss.inసైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాబితాను 23వ తేదీన ప్రచురిస్తామని, 24న ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ తయారీ ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న డీఈఓ ప్రకటిస్తారన్నారు. 26న ఎంపికైన జ్యుజుట విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన అదే రోజు ప్రవేశాలుంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

బి.కొత్తకోట, జూన్6(ఆంధ్రజ్యోతి): స్థానిక జయశ్రీ కాలనీలో డిగ్రీ విద్యార్థిని నవిత అదృశ్యమైందని సీఐ జీవన్‌గంగనాథబాబు తెలిపారు. నరసింహులు కుమార్తె నవిత అంగళ్లు వద్ద ఓ ఇంజనీరింగ్ కాలేజిలో బీసీఏ చదువుతోంది. తరచూ కాలేజికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 4న ఇంటినుంచి వెళ్లిన నవిత తిరిగి ఇంటికి రాలేదు. అమ్మాయి ఆచూకీ కోసం ప్రశ్నించినా జాడ తెలియలేదు. దీంతో ఆమె తండ్రి నరసింహులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


సీతారామ లక్ష్మణ విగ్రహాలు

బి.కొత్తకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరివంది రం వీధిలో శుక్రవారం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుల వారి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాలను నెలకొల్పి ప్రాణప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

కలికిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని వాల్మీకిపురం ఎక్సైజు పోలీసులు అరెస్టు చేశారు. వీరికి సారా సరఫరా చేస్తున్న మరొకరిపై కేసు నమోదు చేశారని ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనరు ఆదేశాలతో గుండ్లూరు గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న ఎస్.అల్తాఫ్ బాషా, టి.కిరణ్‌కుమార్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో సారా విక్రయిస్తుండగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి 14 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సారా సరఫరా చేస్తున్న క్రాంతి అనే వ్యక్తిపై విడిగా కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రమ్మ, వాల్మీకిపురం సీఐ లత, ఎస్ఐ సుభాషిణి, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.